'కంటివెలుగు' మాక్‌డ్రిల్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్న రెండవ విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. మంగళవారం స్థానిక కొత్త కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఈనెల 18న స్థానిక వైద్యాధికారి ఇతర సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై చర్చించి మరోసారి కంటి వెలుగును విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు తేజాస్, సీతారామారావు, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీఎంహెచ్ఓ కృష్ణ, డాక్టర్ రఫీ, పశుసంవర్ధక శాఖ అధికారి మధుసుదన్‌గౌడ్, అధికారులు మోతిలాల్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం నిర్వహించిన మాక్‌డ్రిల్ విజయవంతమైంది. అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో 2 బృందాలు 1, 2 వార్డుల్లో మాక్ డ్రిల్ నిర్వహించి 18ఏళ్ల దాటిన వారికి కంటి పరీక్షలు చేయడాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ డా. శివకాంత్, కమిషనర్ మహమూద్‌షేక్‌లు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 36,250మందికి కంటి పరీక్షలు చేయనున్నారు. గంగాపూర్ ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం పరిధిలో గంగాపూర్‌లో డా. సమత, షాజహాన్‌ల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మండలంలోని 45 గ్రామపంచాయతీల్లో 2 బృందాలు కంటి పరీక్షలు చేయనున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

దేవరకద్ర: స్థానిక మండల కేంద్రంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ట్రయల్ రన్‌తో ప్రారంభించారు. మండల పరిషత్ సమీపంలోని మహిళా సమాఖ్య భవనంలో కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి శంకరాచారి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు ప్రారంభించారు. మండలంలోని బస్వాయపల్లిలో కంటి వెలుగు పరీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నవాబుపేట: కంటి వెలుగు కార్యక్రమం వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కంటి వెలుగు అధికారి డాక్టర్ రఫీక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో కంటి వెలుగు మాక్‌డ్రిల్ నిర్వహించారు. మండలంతో పాటు కొల్లూర్, కాకర్‌జాల్‌తండాలో కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, నవాబుపేట సర్పంచ్ గోపాల్‌గౌడ్, నర్సింహ, ఐసీడీఎస్ సిబ్బంది సరస్వతి, ప్రమీళ, ఉమాదేవి, అనుసూయ, సునీత, విమల పాల్గొన్నారు.

మిడ్జిల్: కంటి వెలుగు రెండవ దశ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో మాక్ ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎంపీఓ అనురాధ, వైద్యాధికారి మనుప్రియ, జంగయ్య, గీత పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం కోత్లాబాద్ పీహెచ్‌సీలో కంటి వెలుగుపై మాక్ డ్రిల్ నిర్వహించారు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో వైద్యాధికారి, సర్పంచ్, ఎంపీటీసీలు, తదతరులు పాల్గొన్నారు.


మున్సిపాలిటీ పరిధిలో మాక్ డ్రిల్ పరిశీలిస్తున్న అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్, కమిషనర్లు


దేవరకద్రలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

మార్కెట్‌కు వరుస సెలవులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని మార్కెట్‌కు సంక్రాంతి పండుగ సందర్భంగా వరుసగా సెలవులు ఇచ్చారు. శనివారం నుంచి మంగళవారం వరకు నాలుగు రోజుల పాటు మార్కెట్‌లో ఎలాంటి లావాదేవీలు జరగలేదు. మూడు రోజులు పండుగ సెలవులతో పాటు మరో రోజును అదనంగా సెలవుగా ఇచ్చారు.

హమాలీ మృతి ...

దేవరకద్ర మార్కెట్‌లో పనిచేసే హమాలీ బోయ ఆంజనేయులు మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తు బుధవారం మార్కెట్‌ను బంద్ చేస్తున్నారు. మార్కెట్‌లో ఎలాంటి లావాదేవీలు జరగవని అధికారులు ప్రకటన జారీ చేశారు.

ఆర్థిక సాయం



బాలానగర్: మండల పరిధిలోని నందారానికి చెందిన మొల్లర పరుశరాములు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలిసిన 1999 బ్యాచ్ జెడ్పీ ఉన్నత పాఠశాల బాలానగర్‌లో విద్యను అభ్యసించిన తోటి స్నేహితులు అంతాకలిసి రూ.43 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ వెంకటయ్యలు దాతలను అభినందించారు.

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



హన్వాడ: క్రీడలతో మానసికోల్లాసమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేపూర్‌లో శాంతనారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఈ పోటీల్లో మహమ్మదాబాద్ టీం విజేతగా నిలవగా, నంచర్లగేట్‌కు చెందిన జట్టు రన్నరఫ్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.30వేల నగదు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాల్‌రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు రమణారెడ్డి, నరేందర్, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): దేశంలో ప్రశ్నించే గొంతులను అణచివేయాలని కుట్ర జరుగుతుందని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సిములు, మూడా చైర్మన్ వెంకన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ బకాయిలు చెల్లించాలి



కోయిల్‌కొండ: మండలంలోని నక్కవానికుంట తండాలో పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాము అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలీ డబ్బులను కూలీలకు వెంటనే చెల్లించాలని, రెండు వందల రోజులకు పని పెంచి కుటుంబంలోని అందరికీ పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కూలీల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకట్రాములు, ఎదురింటి నర్సిములు, సుబాష్, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో బీజేపీదే అధికారం



అడ్డాకుల: రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రానుందని ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం జానంపేటలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సిములుతో కలిసి మంగళవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి బీజేపీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాలనర్సిములు, భరత్‌భూషణ్, కొండారెడ్డి, దేవేందర్‌రావు, నాగరాజు యాదవ్, శివశంకర్‌గౌడ్, సూర్యప్రకాష్, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన మహ్మద్ సల్మాన్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చంద్రకుమార్‌గౌడ్, కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్, నాయకులు అజీజ్, తాహెర్, మురళీగౌడ్, పీర్ సాధిక్, కురుమయ్య యాదవ్, ఫక్రు, నాగరాజు, సిరాజ్, జహంగీర్, రవికుమార్, వెంకటలక్ష్మీ, అలీ, షబ్బీర్, మస్తాన్, యాసిన్, మహబూబ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ టోర్నీలో 'కౌకుంట్ల' విజయం

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన బేరి నాగేందర్ స్మారక క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో కౌకుంట్ల జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా పెద్దమందడి జట్టు గెలిచింది. మంగళవారం సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో ప్రముఖ సామాజిక వేత్త కావలి పవన్‌కుమార్‌యాదవ్ విజేత జట్టుకు రూ. 50 వేల ప్రైజ్ మనీని అందజేశారు. అదే విధంగా రన్నర్ జట్టు పెద్దమందడికి రూ. 25 వేలను సర్పంచ్ స్వప్న కిషన్‌రావులు అందజేశారు. గత 13 రోజులుగా జరిగిన క్రికెట్ టోర్నీలో ఆటగాళ్లందరికి సామాజిక వేత్త జాంగీర్ భోజనాలు అందించారు.

యువత రాణించాలి....

గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల్లో రాణించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి కోరారు. క్రీడలతో మానసిక ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి భవిష్యత్తుకు పునాదిగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, కిష్టన్న, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివకుమార్, కేబీఆర్‌గౌడ్, ఉప సర్పంచ్ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న సామాజికవేత్త కావలి పవన్‌కుమార్‌యాదవ్

చిన్నారులకు వైద్య పరీక్షలు



హన్వాడ: మండల పరిధిలోని కొనగట్టుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కె టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చిన్నారులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, సర్పంచ్ మానస పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉత్తమ భవిష్యత్

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: గ్రామీణ యువకులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం నిజాలాపూర్‌లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం తిలకించారు. ఈ పోటీల్లో అమిస్తాపూర్, జానంపేట జట్లు ఫైనల్లో తలపడగా జానంపేట విజేతగా నిలిచింది. అలాగే నిజాలాపూర్‌కి చెందిన వెంకటయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.48వేల చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ పాల్గొన్నారు.

దేవరకద్ర: మండలంలోని గూరకొండలో బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాములు తల్లి మృతి చెందడంతో మంగళవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ఆమె భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల నాయకులు జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కొండారెడ్డి పాల్గొన్నారు


నిజాలాపూర్‌లో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు

రాజాపూర్: రైతులు సాగు చేసుకున్న వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరెందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఈద్గాన్‌పల్లి, బీబీనగర్, ఖానాపూర్‌లలో రైతులు సాగు చేసిన వేరుశనగ, వరి పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా వేరుశనగలో పొగాకు లద్దెపురుగు పంటలను నాశనం చేస్తుందని, వీటి నివారణ కోసం ఎరపంటలుగా ఆముదం లేక పొద్దుతిరుగుడు 30నుంచి 40 మొక్కలు ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. దీంతో పురుగులు ఉధృతి తగ్గుతుందని అన్నారు. అంతేకాకుండ నొవొల్యూరాన్ రసాయన మందును ఎకరాకు200 మిల్లీ లీటర్ల మందును 200 నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. తిక్క ఆకుమచ్చతెగులు ఆశించిన యెడల టేగుకొనజోల్ 200 మిల్లీ లీటర్లు మందును 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వరిలో కాండం తొలుచుపురుగు ఆశించినచో క్వినాల్‌ఫాస్ లేక ప్రొఫినోపాస్ 2మిల్లీ లీటర్ల మందును ఒక్క లీటర్ నీటితో కలిపి పంటపై పిచికారీ చేసి పంటను కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు దీపికాగౌడ్, శ్రీనివాస్, రైతులు శివరాములు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.


ఖానాపూర్ గ్రామశివారులో వేరుశనగ పంటపై జాగ్రత్తలు వివరిస్తున్న ఏఓ నరెందర్

ముమ్మరంగా నర్సరీల పనులు

నవాబుపేట: మండలంలో నర్సరీల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఉపాధి హామీ పథకం ఏపీఓ జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలో జంగమయ్యపల్లి, కామారం, అమ్మపూర్‌లలో నర్సరీల పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో కవర్లలో మట్టి నింపడం దాదాపుగా పూర్తి కావొచ్చిందని వివరించారు. ప్రతి గ్రామంలో 40 వేల నుంచి లక్ష మొక్కల పెంపకం వరకు గ్రామాల వారిగా టార్గెట్ చేసి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. మొక్కలకు సంబంధించి విత్తనాలు నాటేందుకు సీడ్ వివరాలు సేకరించినట్లు ఆమె తెలిపారు. జంగమయ్యపల్లిలో వంద శాతం మట్టి నింపడం పూర్తి కావడంతో ఆయన సర్పంచ్, సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట సర్పంచ్‌లు వెంకటేష్, భోజమ్మ, యాదయ్య, సత్యం ఉన్నారు.

రూపుదిద్దుకుంటున్న స్టేడియం ఆర్చ్



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే మైదానంలో బాస్కెట్‌బాల్, ఆర్చరీ జోన్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హైజంప్, లాంగ్‌జంప్ కోర్టులు ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్ పూల్ నుంచి డీఎస్‌ఏ కార్యాలయం వరకు సీసీ రోడ్డు వేశారు.

● మెయిన్ స్టేడియంకు వెళ్లే దారిలో ఆకర్షణీయంగా రెండు ఆర్చ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి స్టేడియంకు వెళ్లే చోట ప్రధాన ఆర్చ్ పనులు ఇప్పటికే చివరి దశలో ఉన్నాయి. దాదాపు రూ.25లక్షల నిధులతో ఈ ప్రధాన ఆర్చ్ పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన ఆర్చ్ రెండు వైపుల క్రీడాకారుల బొమ్మలు, వింగ్‌వాల్స్ ఏర్పాటు చేయనున్నారు అదే విధంగా స్టేడియంకు వెళ్లే గేటు వద్ద రూ.12 లక్షలతో మరో ఆర్చ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆర్చ్ పనులు కూడా ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రధాన ఆర్చ్ నుంచి స్టేడియం గేటు వరకు బీటీ రోడ్డు వేశారు.

రోహిత్ వేములకు నివాళులు


రోహిత్ వేములకు నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

జడ్చర్ల టౌన్: రోహిత్ వేముల వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోహిత్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరశురాం, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌లు మాట్లాడుతూ దేశంలో దళిత విద్యార్థుల పట్ల వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. ఫెలోషిప్‌లు నిలిపివేసే కుట్ర జరుగుతుందని, రోహిత్ వేముల స్ఫూర్తిగా మనువాదం, మతోన్మాదం, బీజేపీ ప్రభుత్వం కాషాయపు విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రీచర్స్ స్కాలర్ రోహిత్ వేముల వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య మాట్లాడుతూ అప్పటి సెంట్రల్ యూనివర్సిటీ వీసీ, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌ల వేధింపుల కారణంగానే రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్యం రాజు, పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్దన్, నాయకులు సత్యం, శ్రీను, మోహన్, జహంగీర్, గాలెన్న పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

అడ్డాకుల: రహదారిపై ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని ఎంవీఐ నరేష్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని చివరి రోజు మంగళవారం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని తహసీల్దార్ కిషన్, ఎంవీఐ నరేష్ ప్రారంభించారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అరుణ్ డ్రైవర్లకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ నరేష్ మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు వీధిన పడతాయని డ్రైవర్లకు సూచించారు. అనంతరం రోడ్డు భద్రతకు సంబంధించిన కరపత్రాలను డ్రైవర్లకు అందజేశారు. రేడియం స్టిక్కర్లు లేని వాహనాలకు ఎంవీఐ రేడియం స్టిక్కర్లను అతికించారు. వాహనాలను నిలిపి సీటు బెల్టు పెట్టుకోవాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ మదన్‌మోహన్, ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్, రూట్ ఆఫీసర్ రాకేష్‌గౌడ్, తేజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ నరేష్

ఆయిల్‌పాం వైపు అడుగులు

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండలంలోని రైతులు సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు కొత్త పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు వరి, జొన్న, కంది పంటలకే అధిక ప్రాధాన్యం ఇచ్చిన రైతులు క్రమంగా ఆయిల్‌పాం సాగుకు వైపు అడుగులు వేస్తున్నారు. ఉద్యానవన అధికారులు ఆయిల్‌పాం సాగుపై కల్పిస్తున్న అవగాహన సత్ఫలితాలను ఇస్తున్నాయి. పంట సాగుచేసిన నాలుగేళ్ల పాటు అంతర పంటలుగా పెసర, వేరుశనగ, పత్తి, మల్బరీపంటలను సైతం సాగుచేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. మండలంలో 33మంది రైతులు ఇప్పటి వరకు 118 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటల సాగు చేపట్టారు. ఈ సంవత్సరం ఆయిల్‌ఫాం తోటల సాగు గణనీయంగా పెరిగింది.

నాలుగేళ్లకే దిగుబడి..

ఆయిల్‌పాం పంట నాలుగేళ్లకే దిగుబడి వస్తుంది. ఏడాది వయస్సు వచ్చే వరకు నర్సరీలో పెరిగిన మొక్కలను రైతులకు అందజేస్తుండగా రైతు తన పొలంలో నాటిన మూడేళ్లలో దిగుబడి ప్రారంభమవుతుంది. కాగా ఏడాది పొడవునా 30ఏళ్ల పాటు దిగుబడి వస్తుందని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం టన్నుకు రూ.15వేలు ధర ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ధర నిర్ణయిస్తుండటంతో దళారుల ప్రమేయానికి ఎక్కడా ఆస్కారం లేదు.

ప్రభుత్వ ప్రోత్సాహం..

ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఒక్క మొక్క ఖరీదు రూ.193 కాగా ఎకరానికి 57మొక్కలు నాటాల్సి ఉంటుంది. అయితే రైతులు ఒక్కో మొక్కకు రూ.20 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. మొక్కలు నాటిన నుంచి నాలుగేళ్ల పాటు ప్రతి ఏడాదికి ఎకరానికి రూ. 4,200 చొప్పున అందజేస్తోంది. దీనిలో మొక్కల సంరక్షణ కోసం రూ.2,100, అంతర పంటలసాగు కోసం మరో రూ.2,100 చెల్లిస్తుంది. వీటితోపాటు డ్రిప్ కోసం అవసరమయ్యే పరికరాలను సైతం సబ్సిడీపైనే అందిస్తుంది.



గార్లపహాడ్‌లో సాగుచేసిన ఆయిల్‌పాం తోట

నాలుగు ఎకరాలు సాగుచేశా

మా గ్రామంలో రెండేళ్ల క్రితం నాలుగు ఎకరాల పొలంలో ఆయిల్‌పాం తోటను సాగుచేశా. ఇప్పటివరకు రాయితీతో కలిపి లక్షా వరకు ఖర్చు చేశా. మరో రెండేళ్లల్లో పంట వస్తుందని అధికారులు తెలుపుతున్నారు. ఉద్యానవన అధికారులు వచ్చి ఎప్పటికప్పుడు తోటను పరిశీలిస్తున్నారు. ఈ తోట సాగు ద్వారా 25ఏళ్లపాటు పంట వస్తుందన్నారు.

– సురేష్‌రావు, అయ్యవారిపల్లి

మంచి లాభాలు..



ఇతర పంటల సాగుతో పోల్చితే ఆయిల్‌పాం సాగులో రైతులకు మంచి లాభాలు ఉంటాయి. నాలుగేళ్లకే దిగుబడి ప్రారంభమై 30ఏళ్ల వరకు వస్తుంది. అంతర పంటలను సైతం సాగుచేసుకునే అవకాశం ఉండటంతో రైతులకు మరింత కలిసి వస్తుంది. ప్రస్తుతం టన్నుకు రూ.15వేలు ధర పలుకుతోంది. వివరాలకు 7997725186 నంబర్‌కు సంప్రదించాలి.

– చంద్రశేఖర్, ఉద్యానవనశాఖ డివిజన్ అధికారి

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

జడ్చర్ల: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో దాదాపు రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న అంబేద్కర్ కళాభవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పనులను పూర్తి చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని భవనాన్ని ప్రారంభిస్తామని, కావున ఏప్రిల్‌లోగా పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ హీర్యానాయక్, ఏఈ జవహర్‌బాబు, నాగరాజు, శశికాంత్, చైతన్య పాల్గొన్నారు.